క్లుప్తంగా

వెలుగులో ఇంటర్నల్ ఆడిట్



వెలుగు కార్యాలయంలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

రామభద్రపురం: బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి మండలాలకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలపై స్థానిక వెలుగు కార్యాలయంలో శనివా రం పలువురు వెలుగు అధికారులు ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించారు.డ్వాక్రా సంఘాల సభ్యులకు వెలుగు ఆధ్వర్యంలో అందజేస్తున్న స్త్రీనిధి ,బ్యాంక్ లింకేజీ రుణాలు, తదితర లావాదేవీలను పరిశీలించారు. ఎల్‌సీ ఏపీఎం దేముడునాయుడు, స్త్రీనిధి మేనేజర్ రమేష్, బొబ్బిలి,బాడంగి ఏపీఎంలు భాగ్యలక్ష్మి, రత్న కుమార్, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లతో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న వైద్యసిబ్బంది

రేగిడి: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అశిరినాయుడు అన్నారు. మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం వైద్య సిబ్బం దితో కలిసి దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. మరుగుదొడ్లు, కిచెన్, తరగతి గదులు, పాఠశాల పరిసరాల్లో స్ప్రే చేశారు. విద్యార్థులు రాత్రి సమయాల్లో దోమతెరలు వాడేవిధంగా చూడాలని, తాగేందుకు కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహార పదార్థాలను అందజేయాలని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌కు సూచించారు. పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సుందరేశ్వర్, హెల్త్ సూపర్‌వైజర్ కె.అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ వి.ఆర్.సాహు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రైతుల ఎదురుచూపులు



రేగిడిలో నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు

రేగిడి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి విత్తనాల కోసం మండల రైతులు ఎదురు చూస్తున్నారు. వరి నారు పోసే సమయం ఆసన్నం కావడం, ప్రభుత్వం ఇంకా విత్తనాలు సరఫరా చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు దుకాణాల్లో కొను గోలు చేసుకుందామంటే ధరలు అధికంగా ఉన్నాయని, ఏం చేయాలో తెలియడం లేదని పలువురు రైతులు అంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల విత్తనాలు ముందుగానే అందించేవారని గుర్తు చేసుకుంటున్నా రు. మండలంలో సుమారు 7,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తుంటారు. అధికారులు స్పందించి రైతు సేవా కేంద్రాల ద్వారా వరి విత్తనాల పంపిణీ జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రికార్డులను ఆడిట్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి

రాజాం: రాజాం క్లస్టర్ పరిధిలోని ప్రతీ మండలంలో డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేయించుకో వాలని సెర్ప్, డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి, రాజాం వెలుగు ఏసీ చిరంజీవి సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యా ర్డు వద్ద నిర్వహిస్తున్న రాజాం క్లస్టర్ పరిధిలోని సంఘాల రికార్డుల ఆడిట్‌ను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా వీఓఏలు, సీసీలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఆడిట్ వల్ల ఆర్థిక మోసాలు తగ్గించుకునే అవకా శం ఉంటుందని, లావాదేవీలు సక్రమంగా జరుగుతున్నాయో లేదో తెలుసుకునే వీలుంటుందని అన్నారు. సంస్థల పనితీ రు మెరుగుపరుచుకునేందుకు, వనరులు సక్రమంగా వినియోగించుకునేలా సలహాలు, సూచనలు అందించడానికి అవకా శం ఉంటుందని చెప్పారు. ఆడిట్‌ను సక్రమంగా నిర్వహించుకునే బాధ్యతను గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, సీఎఫ్‌లు తీసుకోవాలని సూచించారు.రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఏపీఎంలు, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

మద్యం జోలికి వెళ్లొద్దు..

కొత్తవలస: యువత మద్యం జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు అన్నారు. మండలంలోని ముసిరాంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మద్యం అతిగా తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు.

సమస్యల 'కేంద్రాలు'

- అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు
- సకాలంలో అద్దెలు చెల్లించని వైనం
- రాజాం నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య : 339
- సొంత భవనాలు లేని కేంద్రాల సంఖ్య: 180
- అందని ప్రాథమిక చికిత్స కిట్లు, టీఎల్‌ఎం మెటీరియల్



వంగరలో అద్దెభవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

రాజాం: చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటపాటలో కూడిన విద్యను అందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. సరైన సదుపాయాలు లేని ఇరుకు అద్దె గదుల్లో సిబ్బంది, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వీరు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదులు ఉన్నప్పటికీ అక్కడ ఈ కేంద్రాల నిర్వహణకు అనుమతులు లేకపోవడంతో గత్యంతరం లేక అద్దె భవనాల్లోనే కాలం వెల్లదీస్తున్నారు.

మూడు నెలలుగా అందని అద్దె డబ్బులు

రాజాం నియోజకవర్గంలో రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో మొత్తం 339 ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 180 కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ఇవి అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రాజాం పట్టణంలో ఒక ధర, గ్రామాల్లో ఒక ధర నిర్ధారించి వీటికి స్త్రీశిశు సంక్షేమ శాఖ అద్దెలు చెల్లిస్తోం ది. రాజాం పట్టణంలో ఒక్కో కేంద్రానికి అక్కడ ఉన్న వసతులు ఆధారంగా రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు అద్దె కేటాయించగా, మిగిలిన మండలాల్లో రూ.1,000 నుంచి రూ.2 వేలు అద్దె చెల్లిస్తున్నారు.రెండు నుంచి మూడు నెలలకు ఒక పర్యాయం మాత్రం అద్దె చెల్లిస్తుండడంతో సరైన భవనాలను కార్యకర్తలు అద్దెకు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. రాజాం పట్టణంలాంటి ప్రాంతాల్లో కొంతమంది కార్యకర్తలు సొంత డబ్బులు వెచ్చించి అదనంగా అద్దె చెల్లిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం మూడు నెలలుగా అద్దె చెల్లింపులు నిలిచిపోయాయి.

ఇరుకు గదుల్లో ఇక్కట్లు..

అద్దె భవనాల్లో పలుచోట్ల తాగునీటి సదుపాయంతో పాటు మరుగుదొడ్ల సదుపాయం లేదు. కొన్ని కేంద్రాలు శిథిల భవనాల్లోనూ, మరికొన్నింటిని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు చెందిన ఇళ్లలో, వారి బంధువుల ఇళ్లలో నడుపు తున్నారు. చిన్నచిన్న గదు ల్లో అక్కడే వంట, అక్కడే బోధన సాగిస్తున్నారు. చివరకు చిన్నారులకు ఆటపాటలు కూడా అందులోనే నేర్పించాల్సిన పరిస్థితి. గర్భిణులు, బాలింతలకు సమావేశాలు, కిశోర బాలికలకు అవగాహనా సదస్సులు నిర్వహించే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నిలిచిన టీఎల్‌ఎం మెటీరియల్ పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో ప్రాథమిక చికిత్స కిట్లు అందజేసే వారు. ఇప్పుడు వాటి సరఫరా నిలిచిపోయింది. అలాగే బోధనకు సంబంధించిన టీఎల్‌ఎం మెటీరియల్ గతేడాది కాలంగా కేంద్రాలకు చేరలేదు. చిన్నారులకు అవసరమయ్యే ఫర్నీచర్ కొరత కనిపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రాథమిక చికిత్స కిట్లు, టీఎల్‌ఎం మెటీరియల్ సకాలంలో అందేవి. అలాగే గత ప్రభుత్వం నియోజకవర్గంలో 64 కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా పలుచోట్ల నిర్మాణాలు పూర్తి చేయించింది. ఈ ప్రభుత్వం మిగిలిన కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేలా దృష్టిసారించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పక్కా భవనాలు నిర్మించాలని, సకాలంలో అద్దెలుచెల్లించాలని, ఫర్నీచర్, టీఎల్‌ఎం మెటీరియల్, ప్రాథమిక చికిత్స కిట్లు అందించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



రేగిడి మండలంలోని ఇరుగుగదిలో నిర్వహిస్తున్న ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి వైద్యసేవలందిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

చర్యలు తీసుకుంటున్నాం..

నియోజకవర్గంలో 180 చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. వీటన్నింటికీ పక్కా భవనాల నిమిత్తం ప్రభుత్వాన్ని కోరాం. పలుచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ గదులను అటాచ్ చేస్తున్నాం. విశాల భవనాలతో పాటు మరుగుదొడ్లు, వసతి సమస్యలేని భవనాలను అద్దెకు తీసుకోవా లని అంగన్‌వాడీ కార్యకర్తలకు చెబుతున్నాం. వీటికి అద్దెలు, కరెంటు బిల్లులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం. పెండింగ్‌లో ఉన్న అద్దె బిల్లులు చెల్లించే ఏర్పాట్లు చేశాం.

–డాక్టర్ టి.కనకదుర్గ, ఐసీడీఎస్ సీడీపీఓ, రాజాం

రక్తదాతలు..స్ఫూర్తి ప్రదాతలు



బొబ్బిలి రూరల్: రక్తదాతలను సత్కరిస్తున్న రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు



బొబ్బిలి: రక్తదానం చేసినవారిని సత్కరిస్తున్న నిర్వాహకులు మనోజ్ కుమార్ తదితరులు



రాజాం సిటీ: రక్తదాతలను సత్కరిస్తున్న రాజాం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి రూరల్: రక్తదాతలు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అత్యధిక సార్లు రక్తదానం చేసిన వారిని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా సత్కరించారు. సింద్రీ శ్రీనివాసన్, శ్రీహరి, శంకరరావు వరుసగా 43,38,42 సార్లు రక్తదానం చేసిన సందర్భంగా వారిని అభినందించారు. రోటరీక్లబ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణ,సెక్రటరీ ఎలెక్ట్ శివకాంత్, సర్వీస్‌చైర్ కృష్ణ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయులు

రాజాం సిటీ: అత్యవసర సమయంలో రక్తదానం చేసేందుకు ముందుకువస్తున్న వారు అభినందనీయులని రాజాం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో రక్తగ్రూపులను కనుగొన్న కార్ల్ ల్యాండ్ స్టీనర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అత్యధిక సార్లు రక్తదానం చేసిన మండల చైతన్యకుమార్, వావిలపల్లి చంద్రశేఖర్, కర్నేన జనార్దనరావు, బూరాడ శివకృష్ణను సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై అవగాహన కల్పించి, శిబిరాలు నిర్వహించనున్నామని చెప్పారు. యువ త అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఉల్లాకుల నీలకంఠేశ్వరరావు, అదపాక దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం..ప్రాణదానం

బొబ్బిలి: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన అవేర్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన వారిని,గతంలో పలుమార్లు రక్తదానం చేసిన వారిని ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు.

బాడంగి పశువైద్యాధికారిగా సతీష్‌కుమార్

బాడంగి: స్థానిక పశువైద్యకేంద్రానికి ఎం.సతీష్‌కుమార్‌ను రెగ్యులర్ పశువైద్యుడిగా నియమించగా, వాడాడ పశువైద్య కేంద్రం వైద్యుడిగా ఎం.సత్యనారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సతీష్ ఇదివరకు బొబ్బిలి మండలం పెంట గ్రామంలోని పశువైద్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్‌గా,బాడంగిలో ఇన్‌చార్జ్‌గా పనిచేసే వారు. సోమవారం నుంచి బాడంగిలో పూర్తి బాధ్యతలు చేపట్టనున్నారు.

భారీ వర్షం



వంగరలో కురుస్తున్న వర్షం

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. రోజంతా ఉక్కపోత తో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించిం ది.సుమారు రెండు గంటల పాటు ఎడతెరపిలేకుండా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. కె.కొత్తవలస సమీ పంలోని పొలాల్లో నువ్వు పంటను ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నం కాగా ఇంతలో వర్షం రావడంతో వారంతా బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నారు. బస్‌స్టాప్ సమీపంలో పిడుగులు పడడంతో వారంతా భయంతో గ్రామంలోకి పరుగులు తీశారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు



రాజాం సిటీ: యోగా చేస్తున్న వేతనదారులు



తెర్లాం: తెర్లాం హైస్కూల్‌లో ఆసనాలు వేస్తున్న ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ హేమంత్‌కుమార్



వంగర: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగా చేస్తున్న ప్రజలు

తెర్లాం: యోగాతో అనేక ప్రయోజనాలున్నాయని, రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, శరీరానికి శక్తి, మానసిక ప్రశాంతత లభిస్తాయని ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ హేమంత్‌కుమార్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశా ల ప్రాంగణంలో శనివారం యోగాశిక్షణ తరగతులు నిర్వహించారు. వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులతో పాటు ప్రజలు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మ కంగా యోగాంధ్ర వేడుకలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తున్నారని చెప్పారు. హెచ్‌ఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

17,156 మంది రిజిస్ట్రేషన్

వంగర: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు మండలం నుంచి 17,156 మంది తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి తెలిపారు. మండల కేంద్రంతో పాటు మగ్గూరు, సంగాం గ్రామాల్లో శనివారం నిర్వహించిన యోగా శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన యోగా శిక్షణ తరగతులకు సుమారు 2,500 మంది హాజరయ్యారని చెప్పారు.

రాజాం మండలంలో..

రాజాం సిటీ: ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు మండలంలోని అన్ని పంచాయతీల్లో 23,698 మంది ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తెలిపారు.మండలంలోని పొగిరి, అంతకాపల్లి సచివాలయాల్లో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో శనివారం 9,545 మంది యోగా శిక్షణ తరగతులకు హాజరయ్యారని చెప్పారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు.

న్యాయం గెలిచింది



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును టీడీపీ కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించడాన్ని తప్పు పడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయం గెలిచిందని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొమ్మినేని శ్రీనివాసరావును కూటమి ప్రభుత్వం అన్యాయంగా అరెస్టు చేసిందని ఆరోపించారు. చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగ పాలనలో భాగంగా వాక్ స్వాతంత్ర్యాన్ని సైతం కాలరాస్తున్నారనడానికి కొమ్మినేని అరెస్టే నిదర్శనమన్నారు. సుప్రీంకోర్టు ఈ విషయంలో తన చొరవతో న్యాయాన్ని గెలిపించిందని, కొమ్మినేని అరెస్టును తప్పు పడుతూ రాష్ట్ర పోలీస్‌శాఖ తీరుపై మండిపడిందని వెల్లడించారు. కొమ్మినేనికి బెయిల్ మంజూరీపై హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వ మోసాలను ప్రశ్నిస్తున్న సాక్షి మీడియా గొంతు నొక్కేసేందుకు కూటమి ఎన్నో అరాచకాలు సృష్టిస్తోందని, సాక్షి కార్యాలయాలపై టీడీపీ రౌడీమూకలు చేసిన దాడిపై పోలీస్‌శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజు దగ్గర్లోనే ఉందని ఆయన స్పష్టం చేశారు.

సూపర్ సిక్స్ అమలులో చంద్రబాబు నాలుక మందం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

రామభద్రపురం: సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేశానని సంకలు గుద్దుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నాలుక మందంగా ఉన్నట్లు ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ విమర్శించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావుతో కలిసి మండల కేంద్రంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేశానని,ఇంకా ఎవరైనా సూపర్ సిక్స్ గురించి మాట్లాడి తే నాలుక మందం తప్ప ఇంకొకటి కాదని సీఎం చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉందన్నారు.సూపర్ సిక్స్‌లో భాగంగా అమలు చేసిన తల్లికి వందనం మహా మోసమన్నారు.తల్లికి వందనం ఒక పిల్లకు పడితే మరొక పిల్లకు పడలే దని, అలాగే ఏవేవో నింబధనలు పెట్టి చాలా మంది పేదలకు ఎగ్గొట్టడం మోసం కాదా అని ప్రశించారు. అధికారమే పరమావధిగా గత సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో మాదిరిగానే చంద్రబాబు మేనిఫెస్టోను మడతపెట్టి అటకెక్కించేశా రని అన్నారు. పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున ఇస్తామని చెప్పి ఏడాది అవుతున్నా, ఇప్పటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు.నిరుద్యోగ యువతకు కొన్ని లక్షల ఉద్యోగాలు తీస్తామని, లేదంటే నిరుద్యోగి భృతి ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారని మండిపడ్డారు. రైతులకు ఏడాదికి రూ.20 వేలు చొప్పు పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పటికీ ఇవ్వకపోవడం మోసం కాదా అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కాగ్ పేరుతో మావోయిస్టులను అంతమొందిచడం సబబు కాదన్నారు.వారితో శాంతి చర్చలు జరిపి జనజీవ న స్రవంతిలో కలిసేలా చర్యలు తీసుకోవాలే తప్ప అంతమొందిం చడమేంటని ప్రశ్నించారు.అటవీ ప్రాంతంలో ఉన్న మైన్స్, మాంగనీస్ వంటి విలువై న వనరులను కేంద్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుంటే వాటిని అడ్డుకుంటు న్న గిరిజనులను మావోయిస్టుల పేరుతో చంపేస్తున్నారని ఆరో పించారు. తక్షణమే ఆపరేషన్ కాగ్‌ను ఆపాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్‌ల పిల్లలకు 'తల్లికి వందనం' లేదా..?



మాట్లాడుతున్న జిల్లా సర్పంచ్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ

బొబ్బిలి: ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామ సర్పంచ్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా భావిస్తున్నారా..? వారి పిల్లలకు తల్లికి వందనం ఇవ్వకపోవడానికి కారణమేంటని జిల్లా సర్పంచ్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డల సత్యనారాయణ ప్రశ్నించారు. మండలంలోని జగన్నాథపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్‌లకు గౌరవ వేతనంగా ప్రభుత్వంకేవలం రూ.3వేలు అందజేస్తోందని, ఆమాత్రందానికి ఏకంగా తల్లికి వందనం వంటి పథకాలు నిలిపివేస్తే ఎలా అని నిలదీశారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికైన చంద్రబాబునాయుడుకు ఆ మాత్రం తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలకు దగ్గరై ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టినంత మాత్రాన సర్పంచ్‌లు ధనికులో ఉద్యోగులో కారని ప్రభుత్వం గుర్తెరగాలన్నారు. రాష్ట్రంలో జరిగిన గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఎన్నిక కావడమే దీనికి కారణంగా భావిస్తున్నామని, ఇదేం కక్షపూరిత చర్యని ప్రశ్నించారు. ఇలా సాధారణ సర్పంచ్‌లకు అన్యాయం చేయడం దారుణమన్నారు. వెంటనే సర్పంచ్‌ల పిల్లలకు కూడా తల్లికి వందనం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు భవిష్యత్‌లో అమలు చేసే అన్ని సంక్షేమ కార్యక్రమాలకు సర్పంచ్‌లు అర్హులేనన్నారు. వాటన్నింటినీ అమలు చేయాల్సిందేనన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లంతా ఏకమై ఉద్యమ కార్యాచరణ చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజలు కూడా సర్పంచ్‌లకు అండగా ఉండాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్.హరనాథ్ అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి తదితర గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా వేతనదారులతో శనివారం మొక్కలు నాటించారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత ఉపాధి వేతనదారులు, గ్రామస్తులు తీసుకోవాలని సూచించారు.



వన్నలిలో రోడ్డు పక్కన మొక్కలు నాటుతున్న వేతనదారులు

బాల కృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం



మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: ఉపాధ్యాయులు, ఉపాధ్యాయవృత్తిలో కామ్రేడ్ మార్పు బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయమని బాడంగి ఎంఈఓ పి.లక్ష్మణదొర అన్నారు. శనివారం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్పు బాలకృష్ణమ్మ జయంతి పక్షోత్సవాలకు అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడు, రాష్ట్రకార్యదర్శి పువ్వల ధనుంజయ రావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి వెంకటనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గంట సత్యనారాయణ, సీహెచ్.రామారావు, కె.సత్యారావు, నాలుగు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

శృంగవరపుకోట: నిర్వాసితుల సమస్యల్ని పట్టించుకోకుండా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు తమ గోడు పట్టించుకుని న్యాయం చేయాలని జిందాల్ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డవరలో గల ఎమ్మెల్సీ రఘురాజు నివాసం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం జిందాల్ కర్మాగారం కోసం భూములు తీసుకున్నారన్నారు. 18 ఏళ్లయినా ఇంతవరకు పరిశ్రమ రాలేదని చెప్పారు. భూములు ఇచ్చిన తాము కూలీలుగా మారిపోయామన్నారు. సంస్థ ఇవ్వాల్సిన పరిహారం నేటికీ పూర్తి స్థాయిలో అందలేదని చెప్పారు. కంపెనీ కోసం మేము ఇచ్చిన భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల పేరిట కంపెనీ పెద్దలు, ప్రభుత్వాలు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి పూజకు సిద్ధమైనా, నిర్వాసితుల వినతి మేరకు జగన్ సర్కార్ వెనకడుగు వేసిందని తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే పార్కు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు కూటమి సర్కారు జిందాల్ యాజమాన్యానికి ఒత్తాసు పలుకుతూ భూమిపూజకు సిద్ధపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మీ మాటలు నమ్మి నాడు జిందాల్‌కు భూములు ఇచ్చామని, ఇప్పుడు తమకు న్యాయం జరిగేలా చూడాలని రఘురాజును కోరారు. ఎమ్మెల్సీ రఘురాజు స్పందిస్తూ క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను, నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.